# ఆమె అతడిని మార్చుకుంది



అంగులూరి అంజనీదేవి

# ఆమె అతడిని మార్చుకుంది

అంగులూరి అంజనీదేవి



# ఆమె అతడిని మార్చుకుంది

- అంగులూరి అంజనీదేవి

హైదరాబాదు నుండి వరంగల్ వెళ్లాలని అద్వైత, రాజమోహన్‌రావు బస్టాండ్‌కి వచ్చారు. వాళ్లిద్దరు బస్టాండ్‌లో కొద్దిసేపు వెయిట్ చేశారు.

బస్ వచ్చి ఆగింది..

బస్ ఎక్కాక ముందు సీటు ఖాళీగా వుండటంతో... "నువ్విక్కడ కూర్చో తాతయ్యా ! నేను వెళ్లి వెనకాల సీట్లో కూర్చుంటాను" అంది అద్వైత.

ఆయన సందేహంగా అటువైపే చూస్తూ "నీకు అక్కడ సీటు వుందో లేదో ..." అంటూ కూర్చోకుండా అలాగే నిలబడ్డాడు.

బస్ కదిలింది... వేగాన్నందుకోవడంతో ఆ కుదుపులకి ఆయన నిలబడలేక పోతున్నాడు. ఆయన ధ్యాసంతా మనవరాలికి సీటు దొరుకుతుందో లేదో అన్నదాని మీదనే వుంది.

చివర సీటు ఖాళీగా వుండటం అద్వైతకి కన్పించింది. అటువైపు చూపిస్తూ ...

"నాకక్కడో సీటుంది. నువ్విక్కడ కూర్చో తాతయ్యా! నిలబడకు, పడిపోతావు." అంటూ ఆయన భుజాలు పట్టుకొని సీట్లో కూర్చోబెట్టింది.

రాజమోహన్‌రావు కూర్చున్నాక ఆమె వెనక్కి వెళ్లింది. ఆమె వెళ్లి సీట్లో కూర్చున్నంత వరకు ఆమెనే చూస్తూ ...

"బస్ కదిలింది. జాగ్రత్తగా వెళ్ళి కూర్చో ..." అని చిన్న పిల్లకు చెప్పినట్లు చెబుతూనే వున్నాడు.

వెనకాల నుండి విన్పిస్తున్న తాతయ్య మాటలకి చిన్నగా నవ్వుకుంటూ వెళ్లి కూర్చుంది అద్వైత.

ఈ తరం అమ్మాయిలు చాలా మంది పెద్దవాళ్ళు చూపించే అతి జాగ్రత్తను, అతి ప్రేమను నిర్లక్ష్యంగా చూస్తారు. భుజాలు కదిలిస్తూ వెళ్ళిపోతుంటారు. ఇంకా కొందరు ముఖం మీదే విసుక్కుంటారు... అద్వైత మాత్రం అలా కాదు. వాళ్లు చూపే మమకారానికి, ప్రేమకి మౌనంగా మురిసిపోతుంది. నవ్వుకుంటుంది. ఆనందిస్తుంది.

ఎప్పుడైనా ఆనందం అనేది మనిషికి ఇంకో మనిషి పట్ల వుండే శ్రద్ధలో, చూపించే ప్రేమలో వుంటుందని నమ్ముతుంది అద్వైత.

ట్రాఫిక్ జామ్ వల్ల బస్ అక్కడక్కడ ఆగుతూ వెళ్తోంది.

హెడ్‌సెట్స్ పెట్టుకొని పాటలు వింటూ కూర్చుంది అద్వైత.

హైదరాబాదు అవుట్స్‌కట్స్ రాగానే బస్ ఆగింది.

కిటికీ పక్కనే కూర్చుని వున్న అద్వైత బస్ అక్కడ ఎందుకు ఆగిందో అర్థంకాక బయటకి చూసింది.

అప్పుడు రాత్రి 9.00 దాటుతోంది.

చీకట్లో పొదల చాటు నుండి ఓ వ్యక్తి నడుచుకుంటూ రావటం ఆమెకి కన్పిస్తోంది. అతను ఎక్కగానే కండక్టర్ విజిల్ వూదాడు. తిరిగి బస్ కదలింది... ఇతనేంటి, ఇంత చీకట్లో ఫారెస్ట్ లోంచి వస్తున్నాడు ? చిన్న అనుమానం వచ్చింది అద్వైతకి...

" ... ఎక్కడ పడితే అక్కడ బస్ ఆపుతారెందుకో ...!" అన్నారెవరో బస్‌లో విసుక్కుంటూ.

ఆ మాటలు కండక్టర్‌కి విన్పించి "మా ఆర్.టి.సి. బస్ వాళ్ల బాధలు మీకు అర్థం కావు. బస్ నిండేంతవరకు జనాలను ఎక్కించుకుంటూనే వుండాలి." అన్నాడు.

వెంటనే "టికెట్ ! టికెట్ ! " అంటూ ఈ చివర నుండి ఆ చివర వరకు వెళ్లాడు. ఇంకాస్త దూరం వెళ్లగానే టి.సి. వస్తాడని ఆ కండక్టర్ భయం ...

ఇంత క్రితం బస్సెక్కిన అతను కూర్చోటానికి సీటు లేక రాడ్ పట్టుకొని నిలబడి వున్నాడు. కండక్టర్ అతన్ని చూసి...

"ఎందుకయ్యా నిలబడతావ్ ! అక్కడ సీటుందిగా వెళ్ళి కూర్చో ..." అన్నాడు.

అతను కదలకుండా అలాగే నిలబడ్డాడు.

" ఓ... అమ్మాయి వుందనా ! ఏం కాదులే ! వెళ్లి కూర్చో ! ఇది మోడరన్ జనరేషన్ ! " అన్నాడు.

అయిన అతను కదల్లేదు.

కండక్టర్ కోపంగా చూసి "రాతియుగంలో వున్నవాడిలా కదలవేంటి ? అర్థం కాలేదా ? కూర్చో, కూర్చో " అన్నాడు కసిరినట్లు

అప్పుడు అర్థమై టక్కున అద్వైత పక్కన కూర్చున్నాడు.

అద్వైత పాటల వింటూ పరిసరాలను మరచిపోయివుంది.

తన పక్కన ఎవరో కూర్చున్నట్లు అన్పించినా, తిరిగి చూడలేదు.

ఆమె ఇప్పుడే కాదు, ఎప్పుడైనా అంతే ! దేన్నైనా మనసుతో చూస్తుంది. మనసుతో వింటుంది. మనసుతో ఆస్వాదిస్తుంది. ప్రసుతం ఆమె ద్యాసంతా పాటమీదనే వుంది.

ఆమెకు నచ్చిన పాటను ఏ మాత్రం డిస్టర్బ్ కాకుండా వింటుంది.

ఇంకా బాగా నచ్చిందంటే ఆ పాట సృష్టిని వెతుక్కుంటూ అది రాసినవాళ్లను మెచ్చుకుంటూ వింటుంది. ప్రపంచంలో ఉన్న ప్రతిదీ సృష్టికర్త సృష్టే అని నమ్ముతుంది... అది రాయైనా, చెట్టయినా, పుట్టయినా, పిట్టయినా, పాటయినా, ఏదైనా... వాటిలో పైకి కన్పించని ఏ పంచభూతాత్మవుందో అనుకుంటుంది. దేన్నైనా ప్రేమతో స్పర్శిస్తుంది. ప్రేమతో ఆస్వాదిస్తుంది.

... అతను కూర్చున్నాడేకాని ఆమెను ఏమాత్రం తగలకుండా ఒదిగి కూర్చున్నాడు.

ఆమె వింటున్న పాటలోని భావం ప్రేమను శ్వాసించి తిరిగి నిశ్వాసించినట్లు చుట్టూ వున్న గాలిని పరిమళభరితం చేస్తోంది.... పోగొట్టుకున్నదాన్ని తిరిగి పొందాలని పరుగులు పెడ్తోంది ... తీరాన్ని ఉధృతంగా తాకే అలలా, జ్ఞాపకాల సొగసుల్ని సున్నితంగా తాకుతోంది... ఆకాశమంత ఆర్ధ్రతను ఎద లోతుల్లోకి ఒంపుతోంది.

... అంతలోనే ఏడుపు, అంతలోనే నవ్వు ... అంతలోనే బాధ, దానిపక్కనే కోరిక ... అన్నిటిని మించిన ఇష్టం... కొంచెం గాయం, కొంచెం విరహం, మరి కొంచెం ఓదార్పు, వాటిని మించిన యుగయుగాల దాహం... అశాంతి, అలజడి, అసంతృప్తి, చివరకి తృప్తి, సంతృప్తి... అంతే ! జీవితమనే రంగుల కాగితాన్ని వుండ చుట్టినట్లు ఆ పాటలోని గాఢత, సాంద్రత ఆమెను వివశురాలిని చేస్తోంది. మూగబొమ్మలా కళ్లు మూసుకొని కూర్చుని వుంది అద్వైత.

వేగంగా వెళ్తున్న బస్ ఒకవైపుకి కాస్త ఒరిగినట్లయి, డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయ్యటంతో అద్వైత తన పక్కన కూర్చునివున్న అతని వైపుకి పూర్తిగా ఒరిగిపోయింది. ఆమె మోచేయి అతని తోడమీద గుచ్చుకుంది. ఆమె వెంటనే అలర్టయి మెరుపులా లేచి ఎప్పటిలా కూర్చుంది.

అంతా క్షణాల్లో జరిగిపోయింది.

అతని వైపు చూసి 'సారీ' అంది.

అతనామెను చూడలేదు.

అద్వైత మనసు నొచ్చుకుంది.

... తను 'సారీ' చెప్పటం అతను విన్నా విననట్లున్నాడో లేక వినలేదో అర్థం కాక మళ్లీ చెప్పాలని అతనివైపు తిరిగింది.

ఏదో ఊరు రావడంతో బస్ ఆగింది.

బస్‌లో లైట్లు వెలిగాయి.

బస్‌లోంచి కొందరు దిగితే మరికొందరు ఎక్కుతున్నారు.

లైట్ల వెలుగులో అద్వైతకు అతను స్పష్టంగా కన్పిస్తున్నాడు. లిప్తకాలం ఆమె మతిపోయినట్లయింది.

ఇతనేంటి ఇంత అందంగా వున్నాడు ?

నటుడా ? యాంకరా ? మోడలా ? ఎవరో సెలెబ్రిటీలా వున్నాడే !!!

ఈ మధ్యన చాలా మంది 'ఫలానా యాక్టర్ నాక్లాస్‌మేట్ ! ఫలానా యాంకర్ నా బెంచిమేట్ !" అని పోజులు కొట్టి మరీ చెబుతున్నారు. వింటున్న వాళ్లుకూడా చెవులు రిక్కించి వింటున్నారు. కళ్లు పెద్దవి చేసి చూస్తూ ఆశ్చర్యపోతున్నారు.

... తనకి కూడా ఇతనెవరో తెలిస్తే బావుండు. ఎందుకంటే కొద్దిగంటలు ఇతనితో కలిసి ప్రయాణం చెయ్యడమేకాక, బస్‌కుదుపులకి తన మోచేత్తో ఇతన్ని పొడవటం కూడా జరిగిందని చెప్పుకోవచ్చు. లైఫులో తనకి కూడా ఓ సెలెబ్రిటీతో పరిచయం అయిందని చెప్పుకోవచ్చు. బస్ దిగేముందు తప్పకుండా ఆటోగ్రాఫ్ తీసుకోవాలి. లేకుంటే పిచ్చి జనాలు అరిచి గీపెట్టి చెప్పినా నమ్మరు.

కానీ ఇతన్నెలా పలకరించాలి ?

సీరియస్‌గా ఎటో చూస్తున్నాడే !

ఎందుకో పరిచయం చేసుకోవాలనిపిస్తోంది.

ఎలా పరిచయం చేసుకోవాలి ?

యాంగ్జయిటీగా వుంది అద్వైతకి ...

ఈ లోపల కండక్టర్ వచ్చి అతన్ని ఎక్కడ దిగాలో అడిగాడు. అతను చెప్పాడు... అక్కడికి చార్జ్ ఎంత అవుతుందో చెప్పి, కండక్టర్ టికెట్ చింపబోతుండగా అతను జేబులోంచి పర్స్‌తీశాడు.

అందులో అన్నీ వెయ్యి రూపాయల నోట్లే వున్నాయి. కండక్టర్ అది గమనించలేదు. అద్వైత మాత్రం చూసింది...

ఆ నోట్ల పక్కన ఒకే ఒక్క ఏభై రూపాయల నోటు కొద్దిగా చిల్లర వుండటంతో అవి తీసి కండక్టర్‌కి ఇచ్చి టికెట్ తీసుకున్నాడు. వెయ్యి రూపాయల నోట్లున్న పర్స్‌ని తిరిగి జేబులో పెట్టుకున్నాడు.

కండక్టర్ వెళ్లిపోయాడు.

కొద్దినిమిషాలు గడిచాయి.

అతన్ని పలకరించాలన్న కోరిక అద్వైత మనసులో రొద పెడుతోంది. కళ్లు ఇంతింత చేసుకొని చూడటం తప్ప ధైర్యం చెయ్యలేక పోతోంది.

అంతలో ఆమెకాలికి ఏదో తగిలినట్టైంది.

కొద్ది క్షణాలు వూపిరిబిగబట్టి కట్టెలా బిగుసుకుపోయింది. ఆమె కాలికి ఏం తగిలిందో అర్థం చేసుకునే లోపలే మళ్లీ తగిలింది... తగిలిన చోటే తగులుతోంది.

ఆమెకి అతనిపై అనుమానం వచ్చింది.

అది అతని పనే అనుకుంది.

ఎంత సెలెబ్రిటీ అయితే మాత్రం పక్కన కూర్చున్న అమ్మాయి కాలిని తన కాలితో తాకుతాడా ? ఇదేం సభ్యత ? ఇదేం పోయేకాలం ? అందంగా ఉన్నానన్న పొగరా ? వుంటే వుండొచ్చు ... కానీ ఇలాంటి చీప్ పనులు చెయ్యొచ్చా ?

కోపంగా, ఉక్రోషంగా అతనివైపు చూసి 'హలో' అంది

అతను వెంటనే ఆమెవైపు తిరిగాడు ...

ఏమిటన్నట్లు చూశాడు.

" నా కాలును మీ కాలు తగులుతోంది" అంది.

అతను మౌనంగా చూశాడు.

" కావాలని తాకిస్తున్నారా ?" అంది.

అర్థం కానట్లు చూశాడు.

'వీడికి బలుపు ఎక్కువలా ఉంది' అని మనసులో అనుకుంటూ "చూడండీ ! ఇంతవరకు మీరేదో సెలెబ్రిటీ అన్నట్లు భరించాను. ఇక వూరుకునేది లేదు. మా తాతయ్యతో చెప్పి మీకాలు విరగ్గొట్టిస్తాను..." అంది ఏ మాత్రం మొహమాటం లేకుండా.

అతను అలాగే చూస్తూ "వాట్ ద మీనింగ్ ఆఫ్ కాల్ ? " అన్నాడు.

అద్వైత ఉరిమి చూసి "కాలు మీన్స్ లెగ్ ! " అంది తన కాలికేసి కొట్టుకుంటూ.

" ఓహో ! లెగ్గా ! సో వాట్ ?" అన్నాడు.

కరిచే దానిలా, అసహనంగా చూసింది.

ఆ చూపుకి దడిసి, ఎందుకయినా మంచిదన్నట్లు దూరంగా జరిగి కూర్చున్నాడు...

ఓ నిమిషం గడిచింది...

అయినా ఆమె ముఖంలో అదే ఫీలింగ్ కన్పించింది. ఈ బాధంతా ఎందుకన్నట్లు లేచి నిలబడ్డాడు.

అతను లేచి నిలబడ్డాక కూడా ఆమె కాలికి ఏదో తగులుతున్నట్లు అన్పించింది. వెంటనే కిందకి వంగి చూసింది.

షాక్ తిన్నది అద్వైత ... షాక్‌లోంచి తేరుకొని, వెనక్కి తిరిగి చూసింది.

ఒక తల్లి సీటుకి ఆనుకొని కూర్చుని నిద్రపోతోంది. ఆమె బిడ్డ తాగుతున్న పాలసీసా ఎప్పుడు కిందపడిందో ఆమె చూసుకోలేదు. బస్ కుదుపులకి ఆ పాలసీసా అద్వైత కాలుని తాకుతోంది. ఆ సీసా నిండా పాలున్నాయి.

వెంటనే వంగి ఆ పాల సీసాను చేతిలోకి తీసుకొంది. వెనక్కి తిరిగి నిద్రపోతున్న తల్లివైపు చూసి "అయ్యో! లేమ్మా ! బాటిల్‌ని వదిలేసినట్లు బిడ్డను కూడా వదిలేస్తావు నిద్రమత్తులో..." అంటూ ఆమెను లేపి పాలసీసా చేతికిచ్చింది.

ఆ తల్లి ఉలిక్కిపడి లేచి, బిడ్డను పొదవి పట్టుకొని, కృతజ్ఞతగా అద్వైత వైపు చూసింది.

ఆ తల్లి చూపుతున్న కృతజ్ఞతకు సంతోషపడాలో నిష్కారణంగా అతన్ని అపార్థం చేసుకున్నందుకు బాధపడాలో బోధపడలేదు. అతని స్థానంలో ఎవరున్నా హర్టవుతారు.

వెంటనే అద్వైత లేచి నిలబడి అతని ముఖంలోకి చూడలేనిదానిలా తలవంచుకొని " ఐ యాం సో సారీ ! కూర్చోండి" అంది.

"ఇట్స్ ఓ.కె. ఐ కెన్ స్టాండ్ !" అన్నాడు.

ఆమె అలాగే నిలబడి, నెమ్మదిగా "మె ఐ నో యువర్ నేమ్ !" అంది.

"కార్తీక్ ! " అన్నాడు వెంటనే

సడన్‌గా బస్ ఆగింది.

బస్ ఊగినట్టై నిలబడివున్న అద్వైత ఆపుకోలేక తూలి అతనిమీద పడింది. ఆమెను పడిపోకుండా అతను పట్టుకున్నాడు. తిరిగి వెంటనే వదిలేశాడు.

కళ్ళు తిరిగినట్టైంది అద్వైతకి ...

తనేంటి మాటి, మాటికి అతని మీద పడుతోంది. యాదృశ్చికమే అయినా ఏదోగా వుంది...

ఆమె సీట్లో కూర్చోబోతుండగా బస్‌లోంచి ఒక్కొక్కరే కిందకి దిగుతున్నారు.

ఏమైందో అద్వైతకు అర్థం కాలేదు.

"వాట్ హేపెండ్ కార్తీక్ గారు ? వాళ్లెందుకలా దిగుతున్నారు ? " అంది.

అతనికి తెలుగు కొద్ది, కొద్దిగా అర్థమవుతుంది. కొద్ది, కొద్దిగా మాట్లాడగలడు. హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు బాగా మాట్లాడగలడు.

"బస్ పంక్చర్ !" అంటూ అతను కూడా దిగబోతున్నాడు.

అద్వైత సడన్‌గా లేచి నిలబడింది. అప్పటికే తాతయ్య దిగివుండటం చూసి "అయ్యో ! తాతయ్య చీకట్లో ఎక్కడున్నాడో ఏమో !" అంటూ అతన్ని నెట్టుకుంటూ వేగంగా ముందుకెళ్లి కిందకి దిగింది.

రాజమోహన్‌రావు తన వయసు అతనితో మాట్లాడుతూ రోడ్డుకి అటువైపు నిలబడి అద్వైత కోసం చూస్తున్నాడు.

అద్వైత "తాతయ్యా ! " అంటూ రాజమోహన్‌రావు దగ్గరకి వెళ్లింది.

బస్ లోంచి దిగిన ఆడవాళ్లు, మగవాళ్లు చీకట్లోనే రోడ్డుమీద ఎక్కడ బడితే అక్కడ నిలబడిపోయారు.

కొంతమంది ఎక్కువసేపు నిలబడలేక "ఆ పంచర్ ఎప్పుడు వేస్తారో ఏమో ! " అన్నట్లు ఎక్కడ తెల్లగా రాయి కన్పిస్తే అక్కడ కూర్చున్నారు.

... వేరే బస్సెక్కి వెళ్లిపోదామా అన్నా ఆ బస్‌లు అక్కడ ఆగకుండా వెళ్లిపోతున్నాయి. కారణం వాటిల్లో సీట్లు ఖాళీగా లేకపోవడమే ...

కొద్ది దూరంలో లైట్లు వెలుగుతూ ఒక చిన్న హొటల్ లాంటిది కన్పించింది. ఒక్కొక్కరే కదిలి అటువైపు వెళ్తున్నారు.

అందరికన్నా ముందు డ్రైవరే ఆ హొటల్ వైపు దారి తీశాడు. చక్రధారే మనతో వుండగా మనకేంటి బెంగ అన్నట్లు డ్రైవర్‌తో కలిసి అందరు వెళ్లి ఆ హొటల్లో కూర్చున్నారు.

"తాతయ్యా ! నువ్వేం తింటావ్ ? " అంది అద్వైత.

" నాకు టీ చాలు..." అన్నాడు రాజమోహన్‌రావు.

... తాతయ్యకు టీ చెప్పి, తనకి నాన్స్ చెప్పింది అద్వైత.

ఆయన టీ తాగి లేస్తూ ... "తొందరేం లేదు. డ్రైవర్‌తో పాటు బస్‌లో వున్నవాళ్లంతా ఇక్కడే వున్నారు. నెమ్మదిగా తినిరా ! నేను రోడ్డు మీదకి వెళ్లి నిలబడతాను. ఇక్కడ వుక్కగా వుంది." అన్నాడు.

" సరే ! తాతయ్యా ! " అంది అద్వైత.

అద్వైత పక్కన కూర్చున్నామె ఆపసోపాలు పడిపోతూ ... " బస్సెక్కిన వేళావిశేషం ఇంత ఘోరంగా వుంటుదనుకోలేదు. వర్షం లేకుండా చూసుకునే బస్టాండ్‌కు వచ్చాను. ఈ బస్సెప్పుడు కదలాలి. మనమెప్పుడు వెళ్లాలి. ఇలాంటి కష్టం జీవితంలో ఎప్పుడూ రాలేదు " అంది.

అద్వైత ఆశ్చర్యపోతూ "ఇదొక కష్టమాండీ !" అంది.

"కష్టమా ! కష్టమన్నరా ! ఈ హొటలే లేకుంటే మనపని ఏమై వుండేది ?" అందామె.

" ఏమైవుండదు రోడ్డు మీదనే నిలబడే వాళ్లం ..." అంది అద్వైత

ఆమె విచిత్రంగా చూస్తూ "నువ్వేందమ్మాయ్ ! ఎక్కడికక్కడే సమాదానపడేలా వున్నావు?" అంది.

" దీన్ని సమాదానపడటం అనరు. సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవడం అంటారు" అంది.

ఆమె అసహనంగా చూస్తూ బస్‌ని, ఆర్.టి.సి. డిపార్ట్‌మెంట్ వాళ్లని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. మాటల్లోనే వాళ్లకి శార్థం పెట్టింది. ఆ కోపంలో తాగుతున్న వేడి టీని చేతుల మీద, కాళ్లమీద ఒలికించుకుంది. చుర్రుమనగానే .....

"ఉఫ్, ఉఫ్ ..." అంటూ పక్కనున్న పేపర్ అందుకొని విసురుకుంది.

ఆమె బాధ చూస్తుంటే నవ్వు రావటం లేదు. జాలిగా వుంది అద్వైతకి.

అందుకే ... " చూడండీ ! కోపంగా తిడుతూ టీ పైన పోసుకొని కాళ్లు, చేతులు కాల్చుకున్నారు. అంతమాత్రాన బస్ కదిలిందా ? కొద్ది సేపట్లో రిపేరు పూర్తయి బస్ కదులుతుంది. మీరు కాల్చుకున్నది ఇప్పుడే తగ్గుతుందా ? అంతేకాదు టైర్ పంచర్ అనేది ఏ క్షణంలోనైనా జరగొచ్చు. దానికి ఆర్.టి.సి. సిబ్బందిని తిట్టనవసరం లేదు...

పైగా కోపం దేముందిలే ఖర్చా, పాడా అని అదేపనిగా దాన్ని ప్రయోగిస్తే గుండెకి చేటట. అమెరికా పరిశోదకులు సుమారు ఆరు వేల మందిపై పరిశోధనలు చేసి ఈ సంగతి తేల్చారట...." అంది అద్వైత.

"ఆ ... నిజమా ! అమ్మాయ్ ? " అంది కళ్లు తేలేస్తూ

" ఆ ... అనటంతోనే సరిపోదు. గుండెను జాగ్రత్తగా కాపాడుకోవాలి ..." అంటూ నాన్స్ తినటం పూర్తి చేసింది అద్వైత.

అద్వైత పక్క బెంచీ ముందున్న చెయిర్లో కూర్చుని తింటున్న కార్తీక్ రెప్పవాల్చకుండా అద్వైతనే చూస్తున్నాడు. ఆమె మాటల్ని ఆసక్తిగా వింటున్నాడు. కొంచెం, కొంచెం అర్థమవుతున్నాయి.

తినటం పూర్తయ్యాక ఎవరి బిల్లు వాళ్లు పే చేసి బయటకెళ్లి పోతున్నారు.

అద్వైతతోపాటే కార్తీక్ కూడా లేచి బిల్ కట్టాలని కౌంటర్ దగ్గరకి వెళ్లాడు.

అద్వైత కన్నా ముందు అతనే ఇద్దామన్నట్లు వెయ్యి రూపాయిల నోటు తీసి యిచ్చాడు.

కౌంటర్లో కూర్చుని వున్న వ్యక్తి వింతగా చూసి ఛేంజ్ లేదన్నాడు.

అద్వైత కార్తీక్నే చూస్తోంది. ఎంతమంది సిక్స్ప్యాక్ లొచ్చి ఇతని పక్కన నిలబడినా సరిపోరేమో అన్నట్లు ఆశ్చర్య పోతుంది. ఐదున్నర అడుగుల ఎత్తున్న అద్వైత కార్తీక్ భుజాలను ఓ ఇంచ్దాటి కన్పిస్తోంది.

హొటలతను కార్టీక్ను కోపంగా చూస్తూ .... "తినే ముందు వుండాలి ఇప్పుడెలా అనే ఆలోచన ..." అన్నాడు.

"వాట్ ఆలోచన ...? " అన్నాడు అంతే కోపంగా కార్తీక్.

హొటలతను తిక్కగా చూసి " నీ బొంద ! నా శ్రార్ధం ! నీ పిండాకూడు..." అన్నాడు.

" వాట్ పిండాకూడు ... ?" అన్నాడు వెంటనే కార్తీక్.

హొటలతను పిచ్చెక్కినట్లు చూసి "నేను చస్తే పెట్టేది. నిద్ర లేచినప్పటి నుండి ఎందర్నో చూశాను. నీలాంటి వాడు ఒక్కడు తగిలినా చాలు. పిచ్చెక్కటానికి ... నీకు తెలుగు రాదు. నాకు ఇంగ్లీషు రాదు. నా హొటల్ వెయ్యి నోటుకి చిల్లరిచ్చేంతగా ఇంకా ఎదగలేదు. నీ దగ్గర డబ్బులు వసూలు చెయ్యడం నావల్ల కాదు. నువ్విక్కడే కూర్చో ! నీ కేదో ఒకపని అప్పజెబుతా ! ఏం చెయ్యను. ఖర్మ ! " అన్నాడు.

" వాట్ ఖర్మ ... ?" అన్నాడు విసుగ్గా చూస్తూ కార్తీక్.

" ఖర్మల్లో చాలా రకాలున్నాయి. నువ్వు నా హొటల్కి రావటమే నా పెద్ద ఖర్మ ... అసలు చిల్లర లేకుండా ఎలా వస్తారయ్యా హొటళ్లకి ... ? నీ బాబు హెలికేప్టర్లో వచ్చి ఇస్తాడనుకుంటున్నావా ?" అన్నాడు హొటలతను.

గొడవ పెరిగి పెద్దదయ్యేలా వుంది.

బస్ రిపేరు పూర్తయి కదలటానికి సిద్ధంగా వుంది.

అద్వైత కంగారుగా చూసి "చూడండీ ! మీరింకేం అనకండి ! దేవుడి దగ్గరకి వెళ్లేటప్పుడు కొబ్బరికాయలే మరచిపోయి వెళ్తున్నారు. చిల్లర మరచిపోవటం పెద్ద తప్పుకాదు" అంది. ఆమెను అలాగే చూస్తున్నాడు కార్తీక్ ... వెంటనే తన బిల్ తోపాటు కార్తీక్ బిల్ కూడా పే చేసింది.

" కమ్ ! కార్తీక్ జీ ! బస్ ఈజ్ మూవింగ్ ! " అంటూ బస్ వైపు పరిగెత్తింది. ఆ వేగానికి ఎద దగ్గర వుండాల్సిన చున్ని మెడదగ్గరకి వెళ్లిపోయి, వెనక రెండు వైపుల గాల్లో తేలుతూ, రివ్వున దూసుకెళ్లి ఆమె వెనకాలే వస్తున్న కార్తీక్ ముఖానికి కొట్టుకుంటోంది.

ఆమెతో పాటు అతనుకూడా బస్సెక్కాడు.

అప్పటికే రాజమోహన్రావు బస్కెక్కి ఎప్పటిలాగే తన సీట్లో కూర్చుని వున్నాడు.

" ఓ.కె. తాతయ్యా ! నేను అదే సీట్లో కూర్చుంటాను " అంది.

" సరే ! నువ్వక్కడే కూర్చో ! డ్రైవర్ మనకి తెలిసినవాడే ! హాస్టల్ రాగానే ఆపుతాడు. నిద్రపోకు ..." అన్నాడు.

" అలాగే ! " అంటూ తన సీటు వైపు కదిలింది.

కార్తీక్, అద్వైత ఎప్పటిలాగే ఒకే సీట్లో కూర్చున్నారు.

అతను అద్వైతవైపు చూస్తూ ... " మీరు నాకు చాలా హెల్ప్ చేశారు. లేకుంటే వాడు నన్ను వదిలేవాడు కాదు. మైగాడ్ ..." అన్నాడు కాస్త తెలుగులో, కాస్త ఇంగ్లీషులో.

" పర్వాలేదు, ఆ మాత్రం హెల్ప్ సందర్భాన్ని బట్టి ఎవరికైనా అవసరం అవుతుంది. పరిస్థితులు చెప్పలేం... అయినా మీ దగ్గర డబ్బులేక కాదు. చిల్లర డబ్బులు లేక ... అంతే ! లైట్ తీసుకోండి !" అంది.

బస్‌లో లైట్లు ఆపేసినా వాళ్లిద్దరు ఒకరికొకరు స్పష్టంగా కన్పిస్తున్నారు. కారణం వాళ్లిద్దరూ తెల్లటి శరీరఛాయలే ...

" థ్యాంక్సండీ ! మీ పేరు తెలుసుకోవచ్చా ?" అన్నాడు.

మాట్లాడుతున్నప్పుడు అతని పెదవులు వింతగా కదులుతుంటే చూపు తిప్పుకోలేక పోతోంది. ముఖ్యంగా అతను ఉచ్చరించే తెలుగుపదాలు ఇప్పుడే మాటలు నేర్చుకుంటున్నట్లు, తడబడటం చాలా తమాషాగా అన్పిస్తోంది.

ఎందుకో అబద్దం చెప్పాలనిపించి " నాపేరు రాధ ! " అంది.

"లుక్ మిస్ బాధా !" అన్నాడు.

" బాధ కాదు రాధ" అంది.

" ఓ.కె. ఓ.కె. రాధ ! మీ సెల్ నెంబర్ ఇవ్వగలరా ?" అన్నాడు.

అతన్ని చూస్తుంటే డీసెంట్‌గా అన్పిస్తున్నాడు.

కొద్ది గంటలు కలిసి ప్రయాణం చేసింది.

అయినా ఫోన్ నెంబర్ ఇవడమంటే ....? కాస్త ఆలోచించాలి.

కొద్దిసేపు ఇవ్వాలనిపిస్తుంది. వెంటనే వద్దనిపిస్తోంది.

అడిగాడు కాబట్టి ఏదో ఒకటి ఇస్తే సరి అనుకుంటూ టక టక నెంబర్ చెప్పింది.

వెంటనే ఆమె చెప్పిన నెంబర్ సెల్‌ఫోన్‌లో ఫీడ్ చేసుకొని రింగ్ ఇచ్చాడు కార్తీక్.

ఆమె ఫోన్ మోగలేదు.

" ఈ నెంబర్ పనిచేయ్యట్లేదు " అన్నాడు నిరాశగా.

" అవును ! తర్వాత బాగు చేయిస్తాను. మొన్ననే నీళ్లలో పడింది. 'వాట్ నీళ్లు' అని అనకండి వెంటనే ..." అంది అతని ముఖంలోకి చూసి నవ్వాపుకుంటూ చిన్న పిల్లాడితో ఆడుకుంటున్న దానిలా ఆటపట్టిస్తూ...

" వై ఆర్ యు లాఫింగ్ ...?" అన్నాడు అదోలా చూస్తూ.

ఆమె హెడ్ సెట్‌ను చెవుల్లోంచి తీసి, మళ్లీ పెట్టుకుంటూ ...

"నేనిప్పుడు నవ్వలేదు. ఆపేశాను." అంది సీరియస్‌గా.

" అదే ... వై ? " అన్నాడు.

" వై అంటే ఏం చెప్పను కార్తీక్ జీ ! మీకు ఏ పదం అర్థం కాదో నాకు తెలియదు. ఏది మాట్లాడినా వాట్, వాట్ అంటారు. మాట్లాడటం మధ్యలో ఆపేసి ఆ పదాన్ని మీకు ట్రాన్స్‌లేట్ చెయ్యాలి. నాకైతే నవ్వుగానే వుంది మీ సమక్షం ..." అంది.

"వాట్ సమక్షం రాధా ! ప్లీజ్ ! టెల్ మీ " అన్నాడు.

తలకేసి కొట్టుకుంది అద్వైత.

జాలిగా చూసి టక్కున ఆమె చేయిపట్టుకొని ఆపేశాడు.

"డోంట్ బీట్ ! యు విల్ గెట్ పెయిన్..." అన్నాడు.

"ఓహో ! పెయినొస్తుందా ? అలాగా ! ఏ మొస్తుందో తెలియక కొట్టుకుంటున్నాన్లే ..." అంటూ మళ్లీ నవ్వుకుంది.

" ప్లీజ్ ! డోంట్ లాఫ్ ! వాట్ సమక్షం ? టెల్ మి" అన్నాడు.

" సమక్షం మీన్స్ మీ ప్రజన్సీ ! అంతే ! అందులో ఇంకేం లేదు. ప్రతిదీ తెలుసుకోవాలన్న క్యూరియాసిటీకేం తక్కువ లేదు. కాకపోతే తెలుగురాక కాస్త ఇబ్బంది పడ్తున్నారు ! మీ ఇబ్బంది నాకు నవ్వుగా వుంది. ఒక్కటి మాత్రం ష్యూర్ ! మీ పక్కన వుంటే బి.పీ. లు రావు, షుగర్లు రావు. లాఫింగ్ సెంటర్లకి కూడా వెళ్లనవసరం లేదు. మీతో మాట కలిపినప్పటి నుండి ఒక్క పాటన్నా కంప్లీట్‌గా వినలేదు..." అంటూ హెడ్‌సెట్‌ను సరిచేసుకొని పాటవింటూ కళ్లు మూసుకొంది అద్వైత.

"ఫోన్ నెంబరు లేదు కదా ! కనీసం మీ అడ్రస్ అయినా చెప్పండి ! " అన్నాడు.

ఆమె వినలేదు. కళ్లు తెరవలేదు.

మూసిన కనురెప్పల వైపు చూశాడు. పెక్యూలయర్‌గా కన్పించింది.

ఆమెను కదిలించటం సంస్కారం కాదనుకున్నాడు.

కొద్ది నిమిషాలు అలాగే నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

సడన్‌గా లేచాడు. వరంగల్ రాకముందే కండక్టర్‌తో చెప్పి బస్‌ను ఆపించుకున్నాడు. మెరుపులా దిగి వెళ్లిపోయాడు.

అద్వైత కళ్లు తెరిచింది.

అతను వెళ్లింది ఆమె గమనించలేదు.

పక్కసీటు ఖాళీగా వుండటం వెలితిగా అన్పించింది.

హాస్టల్ రాగానే రాజమోహన్‌రావు డ్రైవర్‌తో చెప్పి బస్ ఆపించాడు.

అద్వైత బస్ దిగుతూ "కార్తీక్ ఎక్కడ దిగాడో ? మళ్లీ అడవిలోనే దిగాడా ? లేక ఊరిలో దిగాడా ?" అని మనసులో అనుకోకుండా వుండలేకపోయింది.

అతను గుర్తురాగానే సుదీర్ఘమైన నవ్వును మధ్యలో ఆపినట్లు మనసులో చిన్నకుదుపు ... ఎందుకో ఆమెకే తెలియని చిన్న అసంతృప్తి ఒక్క క్షణం ఆమె గుండెను నొక్కి వదిలింది.

* * * * *

ఉరవడిగా ప్రవహించే నీరు లాంటిది కాలం.

నిమిషాలు గంటల్లోకి మారి ఓ రోజు గడిచిపోయింది.

కార్తీక్ ఎంత పని ఒత్తిడిలో వున్నా తనకోసం రాత్రి అద్వైత హెూటల్లో కట్టిన బిల్లే గుర్తుస్తోంది. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలంటే ఆమె ఇచ్చిన ఫోన్ నెంబర్ పని చెయ్యడం లేదు. అడ్రస్ ఎక్కడో తెలియదు. ఇప్పుడేం చెయ్యాలి ? అనుకున్నాడు.

వెంటనే బస్టాండ్‌కి వెళ్లాడు.

రాత్రి బస్‌లో వచ్చిన డ్రైవర్‌ని కలిశాడు. "రాత్రి వెనక సీట్లో కూర్చున్న అమ్మాయి వరంగల్‌లో దిగింది కదా ? ఎక్కడ దిగిందో చెప్పగలరా ?" అని అడిగాడు కార్తీక్.

"రాత్రి ఆ అమ్మాయి ఎక్కడ దిగిందో నేను చెప్పను. ప్రత్యేకించి ఆ అమ్మాయినే ఎందుకు అడుగుతున్నావ్ ? ఏం పని ఆ అమ్మాయితో ... ?" అనుమానంగా చూస్తూ అడిగాడు డ్రైవర్.

"కొంచెం పనుంది. ఆమె బుక్ నా దగ్గర వుండిపోయింది. తిరిగి ఇవ్వాలి..." అన్నాడు ఇంగ్లీషులో కార్తీక్. అప్పుడు నమ్మాడు డ్రైవర్ ఆమె ఎక్కడ దిగిందో చెప్పాడు.

డ్రైవర్‌కి 'థ్యాంక్స్' చెప్పి అద్వైత వున్న హాస్టల్ దగ్గరకి వచ్చాడు కార్తీక్.

మెట్లెక్కి సెకెండ్ ఫ్లోర్‌ని చేరుకున్నాడు.

అక్కడ బాల్కనీలో ఎడమవైపున ఉన్న తులసిచెట్టు దగ్గర ఓ అమ్మాయి నిలబడి వుండటం చూసి .. 'హలో' అన్నాడు పలకరింపుగా.

ఆమె తిరిగి చూసి ఒక్క క్షణం నిశ్చేష్టయై 'వావ్ ! ఎవరితను ? అని మనసులో అనుకుంటూ "ఎవరు కావాలి మీకు ?" అంది.

"రాధ !" అన్నాడు.

" ఆ పేరున్న అమ్మాయి ఈ హాస్టల్లో లేదు. పక్కన కూడా హాస్టల్స్ ఉన్నాయి. వెళ్లి అడగండి !" అంది.

" లేదు. ఈ హాస్టలే. రాత్రి హైదరాబాదు నుండి వచ్చింది... నేను కూడా అదే బస్‌లో వచ్చాను..." అన్నాడు.

అతను ఇంగ్లీషులో మాట్లాడటం విని "మీకు తెలుగు రాదా ?" అంది.

" కొంచెం రాదు. కొంచెం వచ్చు..."

" ఎంత వస్తే నాకెందుకులే ! రాత్రి హైదరాబాదు నుండి వచ్చిన అమ్మాయి పేరు రాధ కాదు. అద్వైత... " అంది.

" ఏంటీ ! అతితనా ? " అన్నాడు.

" అతిత పతిత అని దాని పేరు మార్చెయ్యకండి ! వింటే ఏడుస్తుంది." అంది.

" ప్లీజ్ ! ఇంకోసారి చెప్పరూ ! " అడిగాడు రిక్వెస్ట్‌గా

" అంతవసరమా ? వచ్చిన పని చెప్పండి ! తను రాగానే ఇన్‌ఫాం చేస్తాను." అంది.

ఆ అమ్మాయి ముఖంలోకి ఓ క్షణం పరిశీలనగా చూసి "చిన్న వైట్ పేపర్ ఇవ్వండి ! చెబుతాను." అన్నాడు.

లోపలకెళ్లి వైట్ పేపర్‌తో పాటు పెన్నుకూడా తెచ్చి ఇచ్చింది. అతనా కాగితాన్ని తీసుకొని తులసి కుండీవున్న గోడమీద పెట్టి "అతితా ! ఐ కేమ్ టూ యువర్ హాస్టల్ ! ఐ గేవ్ ద మనీ టూ యువర్ ఫ్రెండ్ ! ఎందుకో ఒకసారి నిన్ను చూడాలనిపిస్తోంది. ఐ మిస్ యూ ఎ లాట్." అని రాసి ఆ పేపర్ని మడిచి ఆమె చేతికి ఇచ్చాడు.

అతను రాస్తున్నప్పుడే ఆ వాక్యాలను ఆమె చదివి ఆశ్చర్యపోతూ "అద్వైతను చూడాలనిపిస్తుందా ? ఎందుకు ? " అంది.

" తెలియదు. వెరీ పెక్యూలియర్ పర్సన్ !" అన్నాడు.

తలవంచుకొంది ఆలోచనగా ... 'ఐ మిస్ ఎ లాట్' అని రాశాడు ఇతను అద్వైతను ప్రేమిస్తున్నాడా ? వీడి మొహానికి తెలుగే సరిగా రాదు. ప్రేమ కూడానా ! చూడటానికి మనిషి మాత్రం బాగున్నాడు. బుర్రతక్కువలా వుంది. లేకుంటే ఒక్క రాత్రి ప్రయాణం చెయ్యగానే ప్రేమించడమేంటి ? వీడితో ఆడుకోవాలి.. అనుకుంటూ ఆమె తలెత్తే లోపలే అతను మెట్లుదిగుతున్నాడు.

"హాలో ! సిక్స్ ప్యాక్ ...!" అంటూ పిలిచింది.

మెరపులా పైకొచ్చి " వాట్ ఈజ్ సిక్స్ ప్యాక్ ! మై నేమ్ ఈజ్ కార్తీక్ ! " అన్నాడు.

"ఏదో ఒక కాకరకాయలే ... నేనీ స్లిప్ అద్వైతకి ఇవ్వాలి అంటే నువ్వోపని చెయ్యాలి ..." అంది.

"వాట్ ! పనా ? పనేంటి ?" అన్నాడు.

"చెబుతా ! చాలా రెస్పెక్ట్‌గా చెయ్యాలి." అంది.

ఆమె ముఖంలోకే చూస్తున్నాడు కార్తీక్.

"ఏంటా చూపు ? చేస్తారా లేదా ? ఈ స్లిప్ అద్వైతకి ఇవ్వాలా ? వద్దా ? " అంది.

" ఇవ్వాలి. పనేంటో చెప్పండి ! " అన్నాడు. అతనికి ఆ క్షణంలో అద్వైత తప్ప ఇంకేం కన్పించడం లేదు...

శ్రద్ధకి మాత్రం అద్వైత తనను తరచుగా విసుక్కోవడం 'ఇందుకేనా మీవాళ్లు హాస్టల్ ఫీజు కట్టి నిన్ను హాస్టల్లో వుంచింది' అంటూ కసురుకోవటం, 'నీ ఫోన్లోంచి ఏ అమ్మాయి అయినా మిస్డ్ కాల్ ఇస్తానంటే ఒప్పుకోకు' అంటూ ఆంక్షలు పెట్టడం గుర్తొస్తోంది.

ఆమె ఎంతకీ మాట్లాడక పోవటంతో "ఇక నేను వెళ్లనా ?" అన్నాడు హిందీలో...

వీడి మొహానికి హిందీ కూడా అని మనసులో అనుకుంటూ "పని తర్వాత చెబుతాను. ముందు అన్నం తిందాంరా !" అంది.

"నో... నో..." అన్నాడు.

"మా హాస్టల్ ఫుడ్ చాలా బావుంటుంది. అందులో అద్వైత వుండే హాస్టల్ కదా ! టేస్ట్ చెయ్యకుంటే ఎలా ! ఈ స్లిప్ నేను అద్వైతకి ఇవ్వాలా వద్దా ...!" అంది బెదిరిస్తున్నట్లు.

అతను అద్వైత కన్పిస్తే బావుండన్నట్లు అటు ఇటు చూస్తున్నాడు.

అతని చూపులు అర్థమై " ఈ టైంలో హాస్టల్లో ఎవరూ ఉండరు. నన్ను మా బ్యూటీ పార్లర్ మేడమ్ ఇవాళ రావద్దని చెప్పింది. అందుకే బోర్‌గా వుంది. ఇద్దరం కలిసే తిందాం..." అంటూ అతన్ని మెస్‌లోకి తీసికెళ్లి ... అక్కడున్న వంట వాళ్లకి "ఇతను మా రిలేటివ్ !" అని చెప్పింది.

వాళ్లు ఆ అమ్మాయితోపాటు అతనికి కూడా అన్నం పెట్టారు. అతను అన్నం కలుపుతుంటే ..."నువ్వేం చేస్తుంటావు ?" అంది.

"మార్కెటింగ్ ..." అన్నాడు.

" ఎక్కడ ? "

" అన్నిచోట్ల ... మా బ్రాంచీలు ఎక్కడ వుంటే అక్కడ. నేను పుట్టింది మాత్రం బొంబాయి." అన్నాడు.

'తొక్కేం కాదూ ! అన్నీ బుస్కులే ...' అనుకుంది మనసులో.

అతను ఓ ముద్దనోట్లో పెట్టుకోగానే కెవ్వున అరిచి ... కళ్లమ్మటి నీళ్లోస్తుంటే "వాట్ ఫుడ్ ది సీజ్ ?" అన్నాడు.

"ఏమైంది ? " అంది.

" టూ హాట్ ! " అన్నాడు.

" నీ బొందేం కాదూ !" అంది నవ్వుకుంటూ

మంచినీళ్లు గడ గడ తాగుతూ ... "వాట్ బొంద ?" అన్నాడు.

" బొంద మీన్స్ గుంట." అంది.

" ఐ డోంట్ నో ద మీనింగ్." అన్నాడు.

"ఏంటి చచ్చినోడా అర్థమయ్యేది ?" అంది.

" వాటీజ్ ద మీనింగ్ ఆఫ్ దట్ లైన్ ?" అన్నాడు.

పిచ్చోడిని చూసినట్లు చూస్తూ " లైన్ మీన్స్ లైన్లో పెట్టటం ... లైన్లో పెట్టటం మీన్స్ అద్వైత కోసం నువ్విక్కడికి రావటం... అద్వైత కోసం చెప్పిన పనులు చెయ్యటం ... ఇప్పుడు చూడు హాట్‌గా వున్నా మెతుక్కో గుక్క నీళ్లు తాగుతూ తినటం ... అర్థమవుతోందా ?" అంది.

అర్థం కానట్లు చూశాడు.

"అంత పెద్ద పెద్ద వాక్యాలు నీకు అర్థం కావని నాకు తెలుసులే... కానీ నీకు నేను తెలుగు నేర్పుతాను. నేర్చుకుంటావా ?" అంది.

" ఓ.కె. " అన్నాడు ఉత్సాహంగా

" తెలుగులో కొన్ని వర్డ్స్ వున్నాయి. అవి చాలా గ్రేట్ వర్డ్స్. మనం బాగా ఇంప్రెస్ అయిన వాళ్ల దగ్గరే వాటిని వాడాలి. నీకు అద్వైత అంటే మంచి ఇంప్రెషన్ వుంది కాబట్టి తన దగ్గర మాత్రమే నేను చెప్పిన వర్డ్స్ వాడాలి. తెలుగులో అంతకు మించిన గ్రేట్ వర్డ్స్ లేవు" అంది.

" టెల్ మి, టెల్ మి" అన్నాడు ఆశగా.

"అద్వైత ఎక్కడ కన్పించినా" ఓసి తింగరదానా ! ఎక్కడ చచ్చావే ! ఇప్పుడా కన్పించేది ?" అని విష్ చెయ్యి. తను నీ వైపు ప్లజంట్‌గా చూసేంత వరకు ఆ వర్డ్స్‌ని యూజ్ చేస్తూనే వుండు. మరచిపోతావేమో ! ఈ పేపర్‌లో రాసిస్తాను. బైహార్ట్ చెయ్యి." అంటూ పేపర్‌పై రాసిచ్చింది.

అతనా పేపర్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

" ఇంకా కొన్ని వర్డ్స్‌ని తర్వాత నేర్పిస్తాను. అన్నీ ఒక్కసారే అయితే వర్కవుట్ కావు." అంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2072**

* * *